సాక్షి
చిత్తూరు
సోమవారం । 20 । జనవరి । 2025



నయా ట్రెండ్ .. చాయ్ ల్యాండ్
ఉద్యోగం రాక పోవడంతో ఇద్దరు మిత్రులు కలిసి చాయ్ కేఫ్ ప్రారంభించి, స్వయం ఉపాధికి శ్రీకారం చుట్టారు. - 8లో



కిటకిటలాడిన బోయకొండ
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. - 8లో



వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చించివేత
వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన సంఘటన వెదురుకుప్పంలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

జీసీజీటీఏ జిల్లా అధ్యక్షునిగా నరేంద్రకుమార్



నరేంద్రకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం (జీసీజీటీఏ) జిల్లా అధ్యక్షునిగా ఏ.ఎం.నరేంద్రకుమార్ (సావిత్రమ్మ డిగ్రీ కళాశాల) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించింది. రిటర్నింగ్ అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో జిల్లా కార్యదర్శిగా భాస్కరరాజు (నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల), కోశాధికారిగా అరుణ కుమారి (నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల), జిల్లా ఉపాధ్యక్షునిగా నందీశ్వరయ్య (పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

కానిస్టేబుల్ అప్పీల్ వాయిదా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణ మైదానంలో సోమవారం జరగాల్సిన కానిస్టేబుల్ అభ్యర్థుల అప్పీల్ కార్యక్రమం వాయిదా పడినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడ్డ ఈ కార్యక్రమం ఈనెల 22న ఉంటుందన్నారు. అప్పీల్ చేయాల్సిన అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులుగా కణ్ణన్



డా.కేఎస్.కణ్ణన్



విజయభాస్కర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ (పీఆర్‌టీయూ) అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా డా.కేఎస్ కణ్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలకు రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, జీవీ రమణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

నూతన కమిటీ
పీఆర్‌టీయూ నూతన కమిటీలో డా.కేఎస్.కణ్ణన్ (జిల్లా అధ్యక్షులు), విజయభాస్కర్‌రెడ్డి (జిల్లా ప్రధాన కార్యదర్శి), నరసింహారెడ్డి (జిల్లా వర్కింగ్ అధ్యక్షులు), మోహన్‌రెడ్డి (జిల్లా అసోసియేట్ అధ్యక్షులు), ప్రకాష్‌రెడ్డి (జిల్లా గౌరవ అధ్యక్షులు) నియమితులైనట్లు ప్రకటించారు.

ఎన్నికలకు ముందు ఇలా ..
పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికలకు ముందు పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీలకు ప్రాణ ప్రతిష్ట కల్పిస్తామన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే పంచాయతీలు పరిపుష్టం కావాలని నీతులు చెప్పారు. సర్పంచ్‌ల అధికారాన్ని కాపాడి గౌరవ మర్యాదలు కల్పిస్తామని ఊదరగొట్టారు.

అధికారంలోకి వచ్చాక ఇలా..
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచ్‌లకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు. వారి విధులను, అధికారాలను ఎమ్మెల్యేల చేతిలోకి తీసుకున్నారు. సర్పంచ్‌లకు తెలియకుండానే పనులకు తీర్మానం చేస్తున్నారు. ఆ పనులను వేరొకరికి అప్పగించి, సర్పంచ్‌లను అవమానిస్తున్నారు. ఇవన్నీ డిప్యూటీ సీఎంకు తెలిసినప్పటికీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.



సర్పంచ్‌ల ఆమోదం లేకుండా గ్రామాల్లో వేసిన సీసీ రోడ్డు

సర్పంచ్ అధికారాలకు తూట్లు
ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండుగను నిర్వహించింది. ఈ పల్లె పండుగలో సర్పంచ్‌ల ఆమోదంతో పనులను తీర్మానించాల్సి ఉంటుంది. అయితే సర్పంచ్‌ల ఆమోదం అవసరం లేకుండానే సీనియర్ సిటిజన్ సంతకం ద్వారా పనులకు తీర్మానం చేశారు. తద్వారా చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టీడీపీ కార్యకర్తలకు పనులు అప్పగించేశారు. జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగలో ఆమోదించిన పనులను ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రూ.88.31 కోట్లతో చేపట్టిన 1577 పనులను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు చెప్పిన వారికే పనులు అప్పగించాలని కొంత మంది ఎంపీడీవోలు సర్పంచ్‌లే ఎదుటే చెబుతుండడం గమనార్హం. పనులు పూర్తయిన తర్వాత పంచాయతీ ఖాతాల్లో జమ చేయాల్సిన నిధులను వెండర్ల ఖాతాల్లోకి నిబంధనలకు వ్యతిరేకంగా జమచేస్తున్నారు. అడ్డగోలుగా సాగుతున్న కూటమి పాలన తీరుపై సర్పంచ్‌లు విమర్శలు గుప్పిస్తున్నారు.

సర్పంచ్.. పవర్‌కు చెక్!

గ్రామ స్వరాజ్య సాధనలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేది సర్పంచులే. అలాంటి సర్పంచ్‌ల హక్కులను, అధికారాలను కూటమి సర్కారు కాలరాస్తోంది. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి సంబంధించిన సర్పంచ్‌లు ఉన్నారనే అక్కసుతో ప్రభుత్వం వారిని పక్కన పెడుతోంది. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను ఇతరులతో చేయించి అవమానిస్తోంది. సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేస్తామని బెదిరిస్తోంది. అధికారుల ద్వారా వారి సంతకాలను బలవంతంగా సేకరిస్తోంది.

- సర్పంచ్‌ల అధికారాలను కాలరాస్తున్న కూటమి సర్కార్
- అనధికార వ్యక్తులకు పనుల అప్పగింత
- ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు
- అధికారంలోకి వచ్చాక చిన్నచూపు



సర్పంచ్‌ల ఆమోదం లేకుండా జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్ల పనులు

నియోజకవర్గం	పనులు	మంజూరైన సీసీ రోడ్లు కి.మీ	నిధులు కోట్లలో
చిత్తూరు	157	20.83	రూ.9.60
జీడీ నెల్లూరు	227	35.07	రూ.12.99
పలమనేరు	189	36.45	రూ.16.81
పూతలపట్టు	205	26.55	రూ.10.51
కుప్పం	428	48.45	రూ.23.15
నగరి	222	20.62	రూ.8.38
పుంగనూరు	149	15.99	రూ.6.87

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేది గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్. అందుకే వారికి ప్రత్యేక అధికారాలు, విధులు కేటాయించారు. వారి విధులను, అధికారాలను కాలరాస్తే అది చట్టవిరుద్ధమవుతుందని తెలిసినా, ప్రభుత్వమే అలాంటి చర్యలకు పాల్పడుతోంది. సర్పంచ్‌లకు తగిన గౌరవం ఇవ్వడం లేదు. జిల్లా వ్యాప్తంగా 4.56 లక్షల కుటుంబాలుండగా, గ్రామాల్లో 3.66 లక్షల కుటుంబాలు, 15.04 లక్షల జనాభా ఉంది. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా అందులో 697 గ్రామ పంచాయతీలున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. చిత్తూరు డివిజన్‌లో 296, కుప్పం డివిజన్‌లో 93, నగరి డివిజన్‌లో 102, పలమనేరు డివిజన్‌లో 206 మొత్తం 697 పంచాయతీలు జిల్లాలో ఉన్నాయి.

కనీస గౌరవం ఇవ్వడం లేదు



ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లకు కనీస గౌరవం ఇవ్వకపోవడం అన్యాయం. ఇలాంటి సందర్భాలు గతంలో ఎప్పుడూ జరగనేలేదు. కూటమి నాయకులు ఇష్టానుసారంగా పనులు చేసుకుంటున్నారు. సమావేశాలకు సర్పంచ్‌లను పిలవడం లేదు. ఎక్కడ ఏం పనులు చేస్తున్నారో చెప్పడం లేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లను దారుణంగా అవమానిస్తున్నారు.
-శ్రీనివాసులు, నాగంవాండ్లపల్లి సర్పంచ్, ఐరాల మండలం

ఎవరూ పట్టించుకోవడం లేదు



గతంలో ఉపాధి హామీ పనులు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేపట్టేవారు. ఇప్పుడేమో నిబంధనలకు వ్యతిరేకంగా బయటి వ్యక్తుల చేత చేపిస్తున్నారు. పల్లె పండుగ గ్రామ సభల్లో కూటమి నాయకులే సొంతంగా తీర్మానాలు చేసుకున్నారు. అధికార పార్టీ నాయకులకు పనులను అప్పగించారు. మా సంతకాలు కావాలంటే ఎంపీడీవోలతో ఫోన్ చేయిస్తున్నారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.
- విశ్వనాథరెడ్డి, సర్పంచ్, మొరం పంచాయతీ, పలమనేరు

చెక్ పవర్ రద్దు చేస్తారట



పంచాయతీలో పనులన్నీ మేమే చేస్తామని టీడీపీ నాయకులు మాపై పెత్తనం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఎప్పుడో పనులు చేశామని, వాటికి బిల్లులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. వారికి కావాల్సిన తీర్మానాలు ఇవ్వకపోతే, వారు చెప్పిన పేమెంట్లు చేయకపోతే చెక్ పవర్ రద్దు చేస్తామని బెదిరిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేకపోతున్నాం. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు.
- రామ్మూర్తి, సర్పంచ్, కుప్పిగానిపల్లి, గుడుపల్లె మండలం

మా సంతకాలు లేకుండానే..



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి మా సంతకాలు లేకుండానే పనులు చేస్తున్నారు. ఆ పనులన్నీ నిబంధనలకు విరుద్ధం. సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వకపోగా ఇంటిపై దాడి చేసి, ఊర్లోకి రానివ్వకుండా చేశారు. స్థానికంగా లేననే సాకుతో చెక్ పవర్ రద్దు చేశారు. నా భర్తను జైలుకు పంపారు. మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, ఎస్సీ కమిషన్, హైకోర్టులను ఆశ్రయించి చెక్ పవర్‌ను తెచ్చుకున్నాం.
- మల్లిక, సర్పంచ్, 89 పెద్దూరు, రామకుప్పం మండలం

గుర్తింపు లేకుండా చేశారు



కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లకు గుర్తింపు లేకుండా చేసేసింది. ఇటీవల మండలంలో ఉపాధి హామీ పథకంలో పనులను చేపట్టారు. ఆ పనులను సర్పంచ్ అంగీకారం లేకుండానే చేపట్టారు. అవసరం లేని ప్రాంతంలో సీసీ రోడ్లు వద్దని చెబుతున్నా టీడీపీ నాయకుడు రూ.5 లక్షలతో రోడ్లు వేశారు. దౌర్జన్యంగా గ్రామస్తులతో సంతకాలు తీసుకున్నారు. అధికారులు వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారు.
- సరళ, సర్పంచ్, కేఎల్‌పురం, కార్వేటినగరం మండలం

సర్పంచ్‌లకు ప్రాధాన్యం లేదు



ఈ ప్రభుత్వం వచ్చాక సర్పంచ్‌లకు ఎందులోనూ ప్రాధాన్యం కల్పించడం లేదు. ఇలాంటి ధోరణి గతంలో ఎన్నడూ లేదు. సర్పంచ్‌లను కాదని బయటి వ్యక్తులు పనులు చేయడం అవమానించినట్టే. ఎన్నికలకు ముందు సర్పంచ్‌లకు ప్రాధాన్యమిస్తామని ఏమేమో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల పట్ల వివక్ష చూపుతున్నారు. ఈ ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ధోరణి మార్చుకోవాలి.
- అనితకుమారి, సర్పంచ్, జోగివారిపల్లి, సదుం మండలం

వెండర్లతో పనులా?



ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లను కాదని వెండర్ల చేత పనులు చేయించి వారి ఖాతాల్లో నిధులు జమచేయడం వింతగా ఉంది. ఈ ప్రభుత్వం సర్పంచ్‌లను అవమానిస్తోంది. ఇటీవల నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో సర్పంచ్‌ల అనుమతి లేకుండానే రిజల్యూషన్ రాసుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మాకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు.
- రజనీకాంత్, సర్పంచ్, వసంతాపురం, గుడిపాల మండలం

గౌరవం దక్కడం లేదు



సర్పంచ్‌లకు కనీస గౌరవం కూడా దక్కడం లేదు. పల్లె పండుగ కార్యక్రమంలో పంచాయతీల్లోని మూడు ప్రాంతాల్లో రూ.11.20 లక్షలతో రోడ్లు వేయాలని నిర్ణయించారు. ఆ పనులు ఎవరు చేస్తున్నారో కూడా మాకు తెలియదు. పంచాయతీలో అభివృద్ధి పనులు ఆగకూడదన్న ఉద్దేశంతో అడ్డుకోవడం లేదు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వాలి.
- విద్య, సర్పంచ్, కలియంబాకం, నగరి మండలం

ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న కల నెరవేర్చుకోవడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేస్తోంది. మెగా డీఎస్సీ అంటూ తొలి సంతకం చేస్తూ హడావుడి చేసిన సీఎం చంద్రబాబు ఆ తరువాత మూడు సార్లు వాయిదా వేశారు. దానికి ఎస్సీ వర్గీకరణ లింకు పెట్టారు. ఆ నివేదిక వచ్చిన తరువాతనే డీఎస్సీ అంటూ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లారు. దీంతో ఆరు నెలలుగా కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.

డీఎస్సీకి వర్గీకరణ లింకు



- అమలుకాని బాబు తొలి సంతకం
- మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు
- నిర్వహణపై రోజుకో ప్రకటన
- ఇప్పటికే మూడు సార్లు వాయిదా

కూటమి నిర్వాకం
మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలిసంతకం అని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతే హడావుడిగా సంతకం కూడా చేశారు. ఆ తరువాత రోజుకో సాకు చూపుతూ వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చిన తరువాతనే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీంతో నెలల తరబడి వాయిదాల పర్వం కొనసాగుతోంది. నిరుద్యోగులు మాత్రం కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో ఉద్యోగంపై నిరుద్యోగుల ఆశలు సన్నగిల్లుతున్నాయి.

కార్వేటినగరం: నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలంటే ఉపాధ్యాయులు కావడమే ఉత్తమ మార్గమని భావించిన అభ్యర్థులు ప్రస్తుతం కోచింగ్ సెంటర్లలో మగ్గిపోతున్నారు. ఒంగోలు, కర్నూలు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చి తిరుపతి కోచింగ్ సెంటర్లలో చేరారు. రెండు నెలల్లో కోచింగ్ పూర్తి చేసుకుని పరీక్ష రాసేయచ్చు అన్న ఆలోచనతో వచ్చేశారు. అయితే డీఎస్సీ వాయిదాలు పడుతూ ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కోచింగ్ వదులుకోలేక, ప్రైవేటు కంపెనీలలో తక్కువ జీతాలకే కార్మికులుగా చేరుతున్నారు.

వాయిదాలకు సాకులు
తొలుతేమో టెట్ మరోసారి నిర్వహించి ఆ పై డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పింది. ఆ తరువాత గతంలో డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి అడ్డంకులు తొలగించి నోటిఫికేషన్ ఇస్తామని వాయిదా వేసింది. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చిన తరువాత నిర్వహిస్తామంటూ లింకు పెట్టింది. అయితే ఈ ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదిక వచ్చేదెప్పుడు, డీఎస్సీ నిర్వహించేదెప్పుడని అభ్యర్థులు అయోమయంలో మునిగిపోయారు.

జిల్లాలో ఖాళీలు ఇలా...
జిల్లా వ్యాప్తంగా 2025 ఏప్రిల్ చివరి నాటికి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీకి సంబంధించి 1,473 పోస్టులు ఖాళీ కానున్నట్లు విద్యా శాఖ గుర్తించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 543, ఎస్‌జీటీ పోస్టులు 930 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలు ఇంగ్లీష్ 105, హిందీ 22, మ్యాథ్స్ 33, ఫిజికల్ సైన్సు 29, జువాలజీ 68, సోషియల్ 132, ఫిజికల్ ఎడ్యుకేషన్ 87, ఇతర కేడర్లలో 47 పోస్టులు ఖాళీలున్నాయి. అయితే ఎన్ని పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందోనన్న ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంది.

కోచింగ్ ఖర్చు పెరుగుతోంది



మాది వ్యవసాయ కుటుంబం. చాలా రోజుల నుంచి డీఎస్సీ కోసం తిరుపతి హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నా. ప్రభుత్వమేమో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వాయిదాలు వేసుకుంటూ పోతోంది. మాకేమో కోచింగ్ ఖర్చుభారీగా అవుతోంది. డీఎస్సీ ఎప్పుడు పెడతారో ఏమో?
- లిష, వేపగుంట, పుత్తూరు మండలం

ఫీజు కట్టలేక అవస్థలు పడుతున్నా



మాది రైతు కుటుంబం. నేను అవనిగడ్డలో డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నా. అయితే ఈ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు వాయిదాలు వేస్తోంది. కోచింగ్, హాస్టల్ ఫీజులు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నా. త్వరగా నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహిస్తే అందరికీ మంచిది.
- ఎ.స్వాతి, పాదిరికుప్పం, కార్వేటినగరం

ఇంటికి వచ్చేశాను



ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలనే ఆశతో డీఎడ్ చేశాను. తిరుపతిలో కోచింగ్ తీసుకున్నాను. ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణలో వాయిదాల పర్వం కొనసాగిస్తుండడంతో ఫీజులు చెల్లించలేక ఇంటికి వచ్చేశాను. నాలాంటి వారు వేలాది మంది డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.
- సాయికుమార్, డీఎస్సీ అభ్యర్థి, కార్వేటినగరం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తొలగింపు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాలను ఆ పదవి నుంచి తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ఆదివారం జీఓను విడుదల చేసింది. అయితే ఆ స్థానంలో ఎవరిని నియమించారో జీఓలో పేర్కొనలేదు. ఇది నామినేటెడ్ పోస్టు కావడంతో ఆమెను ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజల కవి యోగి వేమన

- కలెక్టరేట్‌లో వేమన జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : వేమన ప్రజల కవి అని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు కొనియాడారు. కలెక్టరేట్‌లో ఆదివారం వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరవేసిన గొప్ప సంఘ సంస్కర్త వేమన అని వివరించారు. ఆయన రాసిన పద్యాలను ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు నేర్పించి వాటి భావాన్ని తెలియజేయాలని కోరారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన ప్రజాకవి వేమన అని చెప్పారు. ఆటవెలదిలో సరళమైన రీతిలో హృదయాలకు హత్తుకునేలా పద్య రచన చేశారని వివరించారు. ఆయన పద్యాలను ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోనూ అనువదించారని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తదితరులు పాల్గొన్నారు.



వేమన జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప

సదుం: అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు. మండలంలోని రామాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. తన అపార మేధో సంపత్తితో రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని ఎంపీ చెప్పారు. ఆయన విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మహానుభావుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు వారి సేవలు తెలియడంతో పాటు స్ఫూర్తిని ఇస్తాయని చెప్పారు.

దళితుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కృషి
దళితుల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ఎంతగానో కృషి చేసిందని మాజీ ఎంపీ రెడ్డెప్ప చెప్పారు. తాను గతంలో ఎంపీ అభ్యర్థిగా నిలబడి గెలవడానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తోడ్పాటు ఎంతో ఉందన్నారు. వారి కుటుంబం దళితుల అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచ్ వెంకటరమణ, దళిత సంఘం నాయకులు రాజన్న, రామయ్య, రామచంద్రయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు మీడియం రద్దు నష్టం
పాఠశాల విద్యలో ఇంగ్లిష్ మీడియం రద్దుకు కూటమి సర్కారు చేస్తున్న ప్రయత్నాలతో భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం చేకూరుతుందని మిథున్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు అందిపుచ్చుకోవడానికి మాతృభాషతో సమానంగా ఇంగ్లీషు ఎంతో అవసరమన్నారు. ఇందులో ప్రావీణ్యం ఉంటేనే రాణించగలరని స్పష్టం చేశారు. 96 శాతం మంది తల్లిదండ్రులు ఇంగ్లిషు మీడియం వైపు మొగ్గు చూపినా సర్కారు మాత్రం దాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. దీన్ని విద్యావేత్తలు, మేధావులు వ్యతిరేకించాలని కోరారు. దీనిపై పార్లమెంట్‌లోనూ ప్రస్తావిస్తామని చెప్పారు. రామాపురంలో కమ్యూనిటీ భవనం, ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని సమావేశంలో గ్రామస్తులు కోరగా, వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

క్లుప్తంగా

చిరుజల్లుల్లోనూ జల్లికట్టు కోలాహలం



బైరెడ్డిపల్లె: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కురుస్తున్నా జల్లికట్టు మాత్రం ఉత్సాహంగా సాగింది. లక్కనపల్లెలో ఆదివారం నిర్వహించిన మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. మొదటి బహుమతిగా రూ.2 లక్షలు ప్రకటించడంతో ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పశువులు అధిక సంఖ్యలో విచ్చేశాయి. దీంతో యువకులు భారీగా లక్కనపల్లెకు చేరుకోవడంతో జనసందోహంతో కిక్కిరిసింది. పశువులకు హీరోల పేర్లు పెట్టి పరుగు పందెంలో వదిలి పెట్టారు. దీంతో దూసుకొస్తున్న ఎద్దులను పట్టుకోవడానికి యువత సాహసం చేశారు. అయినా ఆగని పశువులు విజేతగా నిలిచాయి. గెలుపొందిన పశువులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

బైరెడ్డిపల్లె : పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని దేవదొడ్డి సమీపంలో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో 5 మందికి, బైరెడ్డిపల్లె–పుంగనూరు రహదారిలోని బొల్లోనికుంట వద్ద ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు సంఘటనలు ఆదివారం మండలంలో చోటుచేసుకున్నాయి. నెల్లూరుకు చెందిన నివేదిక, కళ్యాణ్ కారులో కుప్పం వైపు బయల్దేరారు. పలమనేరుకు చెందిన భరత్, మురళి, వికాస్ కారులో కుప్పం నుంచి బయల్దేరారు. ఈ రెండు కార్లు దేవదొడ్డి సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. గంగవరం మండలం గొల్రైలదొడ్డికి చెందిన గిరి, వంశీ, కిరణ్‌కుమార్ బొల్లోని కుంట వద్ద ట్రాక్టర్‌ను ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్: మండలంలోని గువ్వకల్లు వద్ద పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ రమేష్ బాబు తన సిబ్బందితో వెళ్లి ఆరుగురిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో లక్ష్మణకుమార్, భానుప్రకాష్, మురుగయ్య, కాశీమ్ సాహెబ్, మనవగస్, రాజేంద్ర ఉన్నారు. వీళ్ల నుంచి రూ.6400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నయా ట్రెండ్.. చాయ్ ల్యాండ్



చైతన్య, అమర్



చదివిన చదువులకు ఉద్యోగాలు రాలేదు. అలాగని వారు నిరాశ చెందలేదు. కుటుంబ బాధ్యతలను గుర్తించారు. స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు. ఉన్నత ఆశయంతో వారి మదిలో మెదిలిన ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు. చాయ్ ల్యాండ్‌ను ప్రారంభించారు. ఇక్కడ కళాశాల వాతావరణాన్ని నింపారు. ఎంతో ఉత్సాహంగా స్టూడెంట్స్‌కు ఓ చేత్తో చాయ్, మరో చేత్తో చాట్ అందిస్తూ.. నవ్వుతూ నవిస్తూ.. ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే పుత్తూరుకు చెందిన చిన్ననాటి స్నేహితులు అమర్, చైతన్య. వారి కొత్త ఆలోచన, చొరవ, నడవడికతో కూడిన స్ఫూర్తిదాయకమైన కథనం.

- ఉద్యోగం సంపాదించలేని డిగ్రీ చదువులు
- నిరాశ, నిస్పృహలకు లోనుకాని మనోధైర్యం
- చాయ్ ల్యాండ్ వైపు నడిపించిన ఆశయం
- పాతికేళ్ల స్నేహం.. కలిసి నడిపిస్తున్న వైనం

పుత్తూరు: స్థానిక ఎన్జీఓ కాలనీలో ఎదురెదురు ఇళ్లలో నివసిస్తున్న అమర్, చైతన్య చిన్ననాటి స్నేహితులు. ఏడేళ్ల వయసు నుంచి కలిసి మెలిసి చదువుకుంటూ పెరిగారు. ప్రస్తుతం 32 ఏళ్ల వయసున్న ఈ ఇద్దరు యువకుల స్నేహానికి పాతికేళ్ల వయసు. స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ వరకు కలిసి చదువుకున్నారు. ఆపై అమర్ ఇదే కళాశాలలో 2013లో బీకాం డిగ్రీ పూర్తి చేశాడు. చైతన్య అదే ఏడాది ప్రైవేటు కళాశాలలో బీకాంతో పాటు 2015లో ఎంబీఏ పూర్తి చేశాడు. ఇద్దరూ గత పదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించారు. ప్రైవేట్ కంపెనీల్లో ప్రయత్నించినా ఫలితం శూన్యం. దీంతో తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను ఎలా నెరవేర్చాలా అన్న ఆందోళనకు గురయ్యారు. అసలు జీవితంలో ఎలా స్థిరపడాలన్న ఆలోచన వీరిని తొలిచేసింది.

చాయ్ తాగుతూ ఆలోచన

ఓ ఫైన్ మార్నింగ్ ఓ షాపు వద్ద ఇద్దరూ టీ తాగుతూ, తమ భవిష్యత్ గురించి మళ్లీ చర్చించడం మొదలెట్టారు. ఇద్దరి కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఇంచుమించు ఒకే విధంగా ఉన్నాయి. ఎక్కడా మనకు ఉద్యోగాలు వచ్చేలా లేదు. మనమే ఏదో ఒక వ్యాపారం చేసి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడాలని నిర్ణయించారు. అయితే ఏ వ్యాపారం చేయాలి? అంటూ చైతన్య ప్రశ్నించాడు. ఏదో ఎందుకు? పని ఉన్నా, పని లేకున్నా.. మనలా.. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ చేసే పని టీ తాగడం, చాట్ తినడం. కనుక అదే మన వ్యాపారం అంటూ అమర్ బదులిచ్చాడు. ఓకే.. మరి పెట్టుబడి? మళ్లీ ప్రశ్నించాడు చైతన్య. ఇద్దరం ప్రైవేటుగా చిట్స్ వేద్దాం. చిట్స్ ఎత్తుకొని ఆ మొత్తంతో వ్యాపారం మొదలు పెట్టి, అందులో వచ్చే ఆదాయంతో ప్రతి నెలా చిట్ మొత్తం కడుతూ అప్పు తీర్చేస్తాం అంటూ వివరించాడు అమర్. వెంటనే ఇద్దరూ కలిసి రూ.5 లక్షల చిట్స్ వేశారు. వాటిని ఎత్తుకొని ఆ మొత్తంతో పట్టణంలోని పలు విద్యాసంస్థలకు సమీపాన మంచి సెంటర్‌లో చాయ్ ల్యాండ్ కేఫ్‌ను ప్రారంభించారు. ప్రతి రోజూ ఇద్దరూ కష్టపడుతూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మొన్నటి వరకు ఉద్యోగం రాలేదని నగరాలకు వలస పోయే యువత ఇప్పుడు స్వయం ఉపాధిపై దృష్టి పెడుతోంది. ఇలా ఉన్న ఊళ్లోనే సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుడుతోంది.



కస్టమర్ వద్ద ఆర్డర్ తీసుకుంటున్న చైతన్య

గర్వంగా ఫీలవుతున్నాం!

చాయ్ ల్యాండ్ నడుపుతున్నందుకు మేము గర్వపడుతున్నాం. ఎందుకంటే మాకు ఎక్కడా ఉద్యోగాలు రాలేదు. ప్రస్తుతం మేమే ఇద్దరికి ఉద్యోగాలిచ్చామని తలచుకుంటేనే గర్వంగా ఫీలవుతున్నాం. అలాగని మా ఉద్యోగ ప్రయత్నాలను విరమించుకోలేదు. దాని ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. అవకాశం వచ్చినప్పుడు ఒడిసి పట్టుకుంటాం. ఉద్యోగాలు వచ్చినా చాయ్ ల్యాండ్ కేఫ్‌ను కొనసాగిస్తాం. అందుకు తగ్గ ప్రణాళిక మా వద్ద ఉంది. మా చాయ్ ల్యాండ్ కేఫ్‌లో అల్లం, ఎలాచీ, గ్రీన్, బ్లాక్ టీలతో పాటు ఫ్రెష్ జ్యూసెస్, ఐస్‌క్రీం, చాట్‌బాండార్‌ను అందుబాటులో ఉంచాం. ప్రతి ఒక్కటీ క్వాలిటీగా అందించడమే మా వ్యాపార విజయం. సేల్స్ పెంచుకుంటూ తగిన ఆదాయం పొందుతున్నాం.

– చైతన్య, అమర్, పుత్తూరు

కుటుంబ నేపథ్యం

పుత్తూరుకు చెందిన సి.ఎస్.శేఖర్, జ్ఞానం దంపతులకు ముగ్గురు సంతానం. రెండవ కుమారుడు సి.ఎస్.అమర్. శేఖర్ చిదా స్పిన్నింగ్ మిల్లులో ఫిట్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. పెద్ద కుమారుడు మధుకి వివాహమైంది. కుమార్తె అశ్వినికి పెళ్లి చేయడం ఈ కుటుంబం ముందున్న పెద్ద టాస్క్.

పుత్తూరుకే చెందిన ఎస్.ఎం.బాలన్, కల్పన దంపతులకు ఇద్దరు సంతానం. రెండవ కుమారుడు చైతన్య. పెద్ద కుమారుడు దిలీప్‌కుమార్‌కు పెళ్లి అయ్యింది. చైతన్య చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కల్పన టైలరింగ్ చేస్తూ ఇద్దరు కుమారులను పెంచి పెద్ద చేసింది.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు దుర్మరణం



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

పుత్తూరు: పుత్తూరు–వేపగుంట రైల్వే స్టేషన్ల మధ్య శనివారం రాత్రి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు, తిరుపతి నుంచి చైన్నెకి వెళుతున్న రైలు నుంచి సుమారు 40 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడు సిమెంట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమ ఛాతిపై నల్లని పుట్టు మచ్చ ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపుకండ్రిగ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు పుత్తూరు గణపతి నగర్‌కు చెందిన ప్రకాష్(45) పుత్తూరు వైపు నడచి వస్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో చీకటిగా ఉండడంతోపాటు వర్షం పడుతుండడంతో మృతదేహంపై నుంచి పలు వాహనాలు వెళ్లడంతో నుజ్జు నుజ్జు అయ్యింది. మృతుడి అన్న సెల్వరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండలంలోని జౌకొత్తూరులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (38) కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సంక్రాంతి సెలవులు ముగుస్తుండడంతో ఉద్యోగులు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మకు పూజలు చేశారు. చిరుజల్లులను సైతం భక్తులు లెక్కచేయకుండా దర్శనకోసం భక్తులు తరలిరావడంతో ఆలయంలో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చించివేత



జక్కిదొనలో చించివేసిన ఫ్లెక్సీ

వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లె, జక్కిదొన గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన జగనన్న ఫ్లెక్సీలు, బ్యానర్లను శనివారం అర్ధరాత్రి చించివేశారు. గత నెలలో మాజీ ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. జన్మదిన వేడుకలను సైతం పండుగలా జరుపుకున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి సైతం పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడ జల్లికట్టు జరిగినా ఏ కార్యక్రమమైనా యువతలో పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. దీన్ని చూసి ఓర్వలేక టీడీపీకి చెందిన చోటా నాయకుల సూచనల మేరకే జగనన్న ఫ్లెక్సీలను చించివేస్తున్నారని పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

బ్యానర్లు ఫ్లెక్సీలు చించివేయడం పిరికి పంద చర్య అని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యానర్లు చించివేయడంపై ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత 70 ఏళ్లుగా జక్కిదొన, గంటావారిపల్లె పంచాయతీలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. జగనన్న సీఎం అయిన ఐదేళ్లలో ఈ రెండు పంచాయతీలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో అందరూ ఒకసారి గుర్తుంచుకోవాలని సూచించారు. కూటమి పార్టీలకు చెందిన వారే చేసి ఉంటారని ఆరోపించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కిడ్నీ వ్యాధులపై జాగ్రత్తలు పాటించండి



ఎమ్మెల్సీ డాక్టర్ సుబ్రమణ్యంను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పుత్తూరు: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యం–అవగాహన అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రత్యేకించి కిడ్నీ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కిడ్నీ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రధానంగా షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. మిత ఆహారంతో పాటు, రోజుకు 4 లీటర్ల మంచినీటిని తీసుకోవడం ద్వారా కిడ్నీల ఫంక్షనింగ్ బాగుంటుందని వివరించారు. కాళ్లు, ముఖం వాచినట్లు ఉంటే వెంటనే కిడ్నీ డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవడంతో పాటు, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వివరించారు. 40 ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకొని, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు డాక్టర్ సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ చిల్డ్రన్స్ డాక్టర్ అర్ముగం, డాక్టర్ రవిరాజు, సంఘ నాయకులు కెవెల్‌మూర్తి, గోపికృష్ణ, గుణశేఖర్‌రెడ్డి, మునికృష్ణ, వెంకటేశులు, మాధవులునాయుడు, రఫీ, నరేంద్రకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

పెద్దపంజాణి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సహదేవి కథనం మేరకు, చౌడేపల్లి మండలం పుదిపట్ల పంచాయతీ తిరుమణిపల్లికి చెందిన లేట్ మునస్వామి రెడ్డి కుమారుడు ఎం.రాజా రెడ్డి(64) రెండేళ్లుగా చెన్నారెడ్డిపల్లిలోని కుమార్తె వద్ద ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని బోరుమోటర్ స్విచ్ ఆన్‌చేసేందుకు వెళ్లి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

వడమాలపేట (విజయపురం) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తపై సర్పంచ్, టీడీపీ నాయకులు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వడమాలపేట మండలం, బట్టికండ్రిగ గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు పవన్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళుతుండగా స్థానిక సర్పంచ్, టీడీపీ నాయకులు అడ్డుపడి బైక్ తాళం లాక్కొని, బీరు బాటిల్‌తో దాడి చేశారు. అంతలో ఆ యువకుడు తప్పించుకున్నాడు. భయంతో ద్విచక్రవాహనాన్ని విడిచిపెట్టి అక్కడి నుంచి ఇంటికి పరుగులు తీశాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసి రెండు రోజులవుతున్నా, పోలీసులు ఇంత వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, కనీసం తమకు జరిగిన అన్యాయంపై విచారణ కూడా చేయలేదని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



పవన్‌కుమార్‌తో తండ్రి సుధాకర్

అడ్డుగా ఉన్నాడనే శివకుమార్ హత్య

పలమనేరు: పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన దళిత నేత శివకుమార్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్య, ఆమె ప్రియుడు షామీర్(30) పథకం ప్రకారం శివకుమార్‌ను హత్య చేసినట్టు తేల్చారు. ఈ క్రమంలో నిందితుడు షామీర్‌ను అరెస్ట్ చేశారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పలమనేరు మండలంలోని ముసలిమొడుగుకు చెందిన శివకుమార్ భార్య ఉషారాణి గత 8 నెలల నుంచి పలమనేరులోని షామీర్ బిరియాని హోటల్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆమెకు షామీర్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న భర్త శివకుమార్ పలుమార్లు భార్యను ప్రశ్నించాడు. ఆమె కొన్నాళ్లు ప్రియుడితో కలిసి బెంగళూరు వెళ్లిపోయింది. దీంతో శివకుమార్ తన భార్య కనిపించలేదని వేలూరులో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇకపై తాను భర్తతోనే కాపురం చేస్తానని ఉషారాణి అందరినీ నమ్మించింది. షామీర్ కూడా తాను ఉషారాణి విషయంలో జోక్యం చేసుకోనని చెప్పాడు. స్నేహితులుగా ఉందామని శివకుమార్‌ను నమ్మించి ఈ నెల 13న పలమనేరు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు పక్కనున్న వెంచర్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించి ఛాతీపై బండరాయితో కొట్టి హత్య చేశారు. ఈ కేసును మూడు రోజుల్లో ఛేదించిన సీఐ నరసింహరాజు, ఎస్‌ఐ స్వర్ణతేజను డీఎస్పీ అభినందించారు.



నిందితుడు షామీర్ అరెస్ట్ చూపుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

LEASE / RENT

■ 40,000 Sft & 15000 Sft రెండు గోదాములు తూకివాకం, రేణిగుంట IDA నందు అద్దెకు కలదు. సంప్రదించండి సెల్: 9849151400.

Services

HOME DELIVERY

■ K.C.రెడ్డి హోమ్ స్వీట్స్, డియర్ సార్ & మేడం క్రింది ఇవ్వబడిన ఫోన్ నెంబర్‌కి కాల్ చేసిన డోర్ డెలివరీ ఇవ్వబడును. సెల్: 7032004391, 9381739343, తిరుపతి.

Wanted

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. తిరుపతిలో పనిచేయుటకు గార్డ్స్ కావలెను. జీతం: 10,000 – 12,000. సంప్రదించండి: 8125223207, 7386263700.

■ AN ISO 90001-2000 Company,PCRWare Housing Ltd," Poineers in Logistics". Candidates Can Apply,Senior Accountant-Having Knowledge in Accountancy with Exp. of 5yrs in New Tally Version. Accounts Manager-Min.2yrsExp.with Tally NewVersion. (B.Com /M.Com). Manager Front Office (F) - Having Min.Exp by Maintenance of Office works & required communication skills.The Manager (commercial)356,2ndFloor, Gandhi Road, Tirupathi.0877-22227579.Email:perwhltd@gmail.com, commercial@drpcrayulu.com

■ **SR Defence Academy,** తిరుపతి నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన Incharges, JL's, PET's & PRO'sకావలెను.ఆకర్షణీయమైన జీతం. Q:డిగ్రీ. ✆ 9000852892, 7893318282.

■ **Josh Properties Required** Civil Engineer, Receptionist, Tele callers, Marketing Managers, Salary+Incentives,Time:10.00 A.M to 07.00 P.M, Josh Properties, 20-5-5/E backside, K.B.R.Hotel, Opp. Alipiri Police Station, Tirupati.✆8790062445, 6302211738.

■ **Leading Real Estate Company** needs Marketing Leaders & Agents. Purley Commission basis. Retd. Persons, House Wifes, Freshers Eligible Full Support & Training will be given. ✆ 8688884157.

■ ఇండియన్ సైంటిఫిక్ కంపెనీ, కేర్ లేబెల్, తిరుపతి నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ బాయ్ కావలెను. సంప్ర: 94400 96441, 96662 23197.

■ **Universal** కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 85027 12418.

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073.

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

■ తిరుపతిలో కేంద్రప్రభుత్వ సంస్థ కొరకు అప్రెంటీస్‌షిప్ కింద పనిచేయుటకు House Keeping Staff (పు–40 Nos/స్త్రీ–15 Nos) కావలెను. జీ:19,500, # 9949942245, 9059054495.

■ తిరుపతిలోని షాప్ నందు పనిచేయుటకు బాయ్స్ కావలెను. సంప్రదించండి సెల్: 9133857101, 9848230725.

■ తిరుపతి P.K.Layoutలో Lakshmi బొటిక్యూ నందు పనిచేయుటకు పార్ట్ /ఫుల్ టైం కటింగ్ మాస్టర్స్ & స్టిచ్చింగ్ మాస్టర్స్ Male/Female కావలెను. శాలరీ:10,000+. 81213 60901.

■ తిరుపతి, పాకాల, చిత్తూరు లోని డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు Male / Female Persons కావలెను. సంప్రదించండి సెల్: 9704412373.

■ ప్రభుత్వ సంస్థలలో Out Sourcing పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్లు, ఒకేషనల్ టీచర్లు, క్లర్క్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్స్,సూపర్‌వైజర్స్ కావలెను 9603255559.

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించబడును. 9110256288, 7875985948

■ కేర్‌టేకర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు. ఫ్రీ రూం+భోజనం. HYD. 7995385899

వాలుగైన్‌ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిజమేనని పరిశీలించిన పిదప స్పందించవలసిందిగా మా పాఠకులకు కోరడ మైనది. ప్రకటనదారు చెప్పే దీనికి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయునప్పుడు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

